విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 30 ఆగస్టు 2025

8 పేజీలు

వినాయక నిమజ్జన ప్రదేశాల్లో

పటిష్ట భద్రత

- గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, ఫ్లడ్ లైట్లు, నాటు పడవలు సిద్ధం
- కొత్తపట్నం తీర ప్రాంతాల్లో పరిశీలించిన ఎస్పీ
- అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు
- ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి చేయాలి
- అధికారులకు ఆదేశాలు, సూచనలు

విశాలాంధ్ర-ఒంగోలు : వినాయక చవితి ఉత్సవాల అనంతరం జరిగే విగ్రహ నిమజ్జనాల దృష్ట్యా జిల్లాలో నిమజ్జనాలు అధికంగా జరిగే కొత్తపట్నం తీర ప్రాంతాలను శుక్రవారం జిల్లా ఎస్పీ దామోదర్ పోలీసు అధికారులతో కలిసి సందర్శించి, నిమజ్జన ప్రదేశాలను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జనం జరుగుతున్న ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్య నిమజ్జనల వద్ద డ్రోన్లు మరియు సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచటం, భద్రతా దళాలు, స్పెషల్ బృందాలు కూడా విధుల్లో భాగంగా పాల్గొన్నాయి. తీరంలోని పలు ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ సజావుగా, భద్రతతో జరిగేందుకు అవసరమైన జాగ్రత్తలు, ప్రత్యేక ఏర్పాట్లపై పోలీసులు అధికారులకు పలు సూచనలు

మిగతా 2 లో ...

అన్ని భాషలందు తెలుగు లెస్స

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : అన్ని భాషలందు తెలుగు భాష లెస్స,తెలుగు భాషను బతకనిద్దాం,గౌరవిద్దామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. గిడుగు రామమూర్తి జన్మదినం,తెలుగు భాష దినోత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగింది. గిడుగు రామమూర్తి చిత్రపటానికి కలెక్టర్ పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. వ్యవహారిక తెలుగు భాష మరింత వినియోగంలోకి తీసుకురావాలని ఉద్యమం చేసిన గొప్ప చారిత్రాత్మక వ్యక్తి రామమూర్తి అని కలెక్టర్ ప్రశంసించారు.సవరం సామాజిక వర్గానికి లిపి సృష్టికర్త ఆయనేనని వివరించారు. 1863లో జన్మించిన ఆయన విద్యను అభ్యసించే సమయంలో గ్రాంథికం ఏలుబడిలో ఉందన్నారు.దాన్ని వ్యతిరేకిస్తూ 17 ఏళ్ల వయసు నుంచి తెలుగు భాష కోసం ఉద్యమించిన గొప్ప ఉద్యమకారుడని వర్ణించారు.తెలుగు భాషను వ్యవహారిక భాషగా మార్చాలని ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు.ఆయన కీర్తిని నేడు మననం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. తెలుగు భాషలో పద్య శాసనాలు ప్రారంభమయ్యింది. జిల్లాలోని అద్దంకి పట్టణంలో నుండే నని ఆయన చెప్పారు. తెలుగు భాషకు బాపట్ల జిల్లా పుట్టినిల్లు అని వివరించారు. తెలుగు భాష కోసం గిడుగు రామమూర్తి చేసిన త్యాగాలు మరువలేనివని ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి.ఆర్.ఓ జి.గంగాధర్ గౌడ్ అన్నారు. తెలుగు భాషకు వెలుగు లాంటి వ్యక్తి గిడుగు రామమూర్తి అని బెటర్ ఫర్ బాపట్ల కార్యదర్శి పి సి సాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మల్లికార్జున రావు పాల్గొన్నారు.

విద్యుత్ భారానికి వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో మరో ఉద్యమం

సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - రేపల్లె : బషీర్ బాగ్ విద్యుత్తు అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్మార్ట్ మీటర్లు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ వామపక్షా పార్టీ నాయకులు శు క్రవారం రేపల్లె తాలూకా సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ముందు వామపక్ష పార్టీలు సీపీఐ, సిపిఎం, సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో పోలీస్ కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలా చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలని, విద్యుత్ అమర వీరుల ఆశయాలను సాధిస్తామని, కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని, విద్యుత్ భారాలలు, స్మార్ట్ మీటర్లకి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్ల పగలగొట్టండి అని పిలుపునిచ్చిన కూటమి

మిగతా 2 లో ...

గుప్తనిధుల తవ్వకాల ముఠా అరెస్ట్

- పోలీసుల చాకచక్యానికి ముఠా నేరగాళ్ల ఆట కట్టు
- పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - కనిగిరి : జిల్లాలోని గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ముఠాను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్టు చేసి పెద్ద ముఠా కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసారు. కనిగిరి నియోజకవర్గంలోని హనుమంతునిపాడు మండల పరిధిలోని నందనవనం పంచాయతీలో గల మల్లప్ప శెల అడవిలోని పాతబడి ఉన్న రంగనాయక స్వామి ఆలయంలో నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా తవ్వకాలకు పాల్పడుతున్న ఈ ముఠా ఈనెల 22వ తారీఖున ఉదయం 5 నుంచి 6 గంటల సమయంలో ఆలయంలో తవ్వకాలుచేస్తుండగా స్థానికులు తవ్వకాలను అడ్డుకోవడంతో ముఠా సభ్యులు గడ్డపారలు, చెలకపారలతో వారిపై దాడికి పాల్పడ్డారు. ఘర్షణలో సురక్షితంగా తప్పించుకుని ఫిర్యాదు దారుడు గ్రామస్థుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసిన వెంటనే జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రావు ఆదేశాల మేరకు కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో సిఐ ఖాజావలి, హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు నేతృత్వంలో పలు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగాయి. సాంకేతిక ఆధారాలు, రహస్య సమాచారం ఆధారంగా చాకచక్యంగా వ్యవహరించి ముఠాను ఈనెల 28న రాత్రి పది గంటల 40 నిమిషాలకు కనిగిరిలోని సాధన రెస్టారెంట్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితులు గిద్దా ఏడుకొండలు (35) పాపిరెడ్డిపల్లి, కండే మధుబాబు (22) పాపిరెడ్డిపల్లి, సుంకిశాల రీగన్ (37) కొండారెడ్డిపల్లి, పాలపర్తి రాజు (37) కనిగిరిలోని పాతూరు గతంలో ఇతనిపై 7 కేసులు ఉన్నట్లు గుర్తించారు. షేక్ పాచ్చా వలి అలియాస్ నైజాం (61) కనిగిరి, వేముల ఏడుకొండలు (45) పామూరుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఏపీ 39 యుహెచ్ 7048 నెంబర్ గల టాటా ఏస్ వాహనం, 3 ప్లాస్టిక్ గోళాలు, 2 గడ్డపారలు, 2 చెలకపారలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని త్వరలోనే వారిని పట్టుకుంటామని తెలియజేశారు.

పోలీసులకు జిల్లా ఎస్పీ అభినందనలు

ఈ కేసులో నిందితుల పట్టివేతలో కీలకపాత్ర పోషించిన డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్సై మాధవరావు, హెడ్ కానిస్టేబుల్ హరి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, సందాని, బాదుల్లా, శ్రీను లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

12వ పీఆర్సీ కమిటీని నియమించి
30శాతం ఐఆర్ ప్రకటించాలి 2లో

పులి మళ్లీ వచ్చింది..?

3లో

12వ పీఆర్సీ కమిటీని నియమించి

30శాతం ఐఆర్ ప్రకటించాలి

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర - కనిగిరి : ఎస్టియు జిల్లా అధ్యక్షులు కె.ఎర్రయ్య రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన డిఏ బకాయిలను వెంటనే చెల్లించి 30శాతం ఐఆర్ ప్రకటించాలని 12వ పిఆర్సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కనిగిరిలోని స్థానిక ఎస్టియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినప్పటికీ డిఏలు, పిఆర్సిల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు, డిఏలు, పిఆర్సీలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే మెగా డీఎస్సీలో మే 15 తర్వాత బిఇడి రిజల్ట్ వచ్చిన వారికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉన్నత పాఠశాలలో విద్యాశక్తి కార్యక్రమాన్ని ఫ్యాప్టో తరపున బహిష్కరించినప్పటికీ కొంతమంది డీఈవోలు హెడ్మాస్టర్ లపై ఒత్తిడి చేస్తున్నారని. కమిషనర్ అనుమతి ఇచ్చినప్పటికీ వారు స్వచ్ఛందమైందని చెప్పినప్పటికీ ఎలాంటి ఉత్తర్వులు లేకుండా విద్యాశాఖ అమలు చేయాలని కోరడము చాలా ఇబ్బందికరంగా ఉందని తెలియజేశారు. తక్షణమే విద్యా శక్తి యొక్క నిబంధనలను మార్చాలని, పిఏఫ్ స్లిప్పులు ఆన్లైన్లో పొందుపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు తుమ్మ వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు దొడ్డా తిరుపతిరెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రసన్న ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా బాపట్లలోని సూర్యలంక బీచ్లో సెప్టెంబర్ 26,27,28 తేదీలలో బీచ్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమమునకు ప్రపంచ నలుమూలల నుండి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎక్కువ సంఖ్యలో తెలుగు రాష్ట్ర ప్రజలు ఈ కార్యక్రమాన్ని తిలకించుటకు విచ్చేస్తారన్నారు. ఈ మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాల్లో తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని,ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలను ఆహ్లాదకరమైన సముద్రతీరంలో నిర్వహించుకోవడం చాలా ఆనందదాయకమన్నారు.ఈ కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో బీచ్ క్రీడలు,పర్యాటక, సాంస్కృతిక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా ఉండాలని ఆయన సూచించారు.మూడు రోజుల పాటు సాంస్కృతిక ప్రదర్శనలు,బీచ్ క్రీడలు,సంగీత నృత్య వినోదం,ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు సందర్శకులను అలరించే విధంగా ఉండాలన్నారు.సంగీతం,నృత్యం,వినోదం వంటి కార్యక్రమాలను తెలుగు సినీ ప్రముఖులచే ఏర్పాటు చేయాలని,తద్వారా ఎక్కువమంది ఈ కార్యక్రమాలకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లేజర్, సాహసోపేతమైన విన్యాసాలు,గాలిపటాల ఎగరవేయటం, పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం,సెల్ఫీ పాయింట్లు మొదలగు వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సూర్యలంక బీచ్లో మూడు రోజుల పాటు జరిగే పర్యాటక దినోత్సవ కార్యక్రమాలకు వేలాది సంఖ్యలో సందర్శకులు ఇచ్చేస్తారని వారి కొరకు వాహనాల పార్కింగ్కు స్థలాలను నిర్దేశించాలని ఆయన అధికారులను ఆదేశించారు.బాపట్ల పట్టణంలోనూ సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాలలో రద్దీని నియంత్రించుటకు చర్యలు తీసుకోవాలని ఆయన పోలీస్ శాఖకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమాల ద్వారా సూర్యలంక బీచ్ పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

- ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా రామాపురం బీచ్లో కూడా మూడు రోజు పాటు సాంస్కృతిక,వినోద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా సెప్టెంబర్ 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సూర్యలంక బీచ్కు వస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.ఈ కార్యక్రమాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని ఆయన పోలీస్ యంత్రాంగానికి పలు సూచనలు చేశారు.సూర్యలంక బీచ్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయుటకు గాను పలు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారని ఆయన తెలిపారు.సూర్యలంక బీచ్లో పర్యాటక దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు,వాహనాల పార్కింగ్కు స్థలాలను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి,జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుషార్ డూడి,రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్,రాష్ట్ర పర్యాటక శాఖ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు,పర్యాటక శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లక్ష్మీ ప్రసన్న,బాపట్ల పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి,డి.ఆర్.డి.ఎ పిడి శ్రీనివాసరావు,జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్,బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియ,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో మరో ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంలో నాయకులు పెద్ద ఎత్తున ప్రజల మీద భారాలు విద్యుత్ చార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయటమేనని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా నాడు 2000సంవత్సరంలో ఆగస్టు 28న తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పోరాటం జరిగి నిన్నటికి 25 సంరాలు గడించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంపు భారం చూస్తుంటే మరో విద్యుత్ పోరాటం ఇప్పుడు పెంచుతున్న విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లును వ్యతిరేకిస్తూ మరోసారి వామపక్షాల ఆధ్వర్యంలో పోరాటానికి ప్రజలు సిద్ధమవుతున్నారని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు బాదుడును తగ్గిస్తామని చెప్పి 14నెలల కాలంలో రూ.15485 కోట్లు భారాలు మోపి ప్రజలనుండి వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉపయోగించుకున్న దాని కంటే ట్రూ అప్, సర్దుబాటు వివిధ చార్జీల పేరుతో అదనంగా వసూళ్లు చేస్తూ చార్జీలు పెంచలేదని బూటకపూ ప్రచారం చేసుకుంటున్నారని, సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని ఆదాని ఇతర కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ట్రూ అప్,సర్ చార్జీల పేరుతో ప్రజల నుండి వసూలు ఆపాలన్నారు. నాణ్యమైన విద్యుత్ పేరుతో ప్రమాదభరితమైన ప్రజలను దోపిడీ చేసే స్మార్ట్ మీటర్ల బిగించి ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఎం.శోభారాణిలు, వామపక్ష నేతలు వై.కిషోర్, కె.ఆశీర్వాదం,కే.రమేష్, ఎం.ఈశ్వరరావు, సుబ్బారావు, డిసిహెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషలో అభ్యాసం సులభతరం

విశాలాంధ్ర-సిఎస్ పురం : ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మాతృభాషలో అభ్యాసం సులభతరంగా ఉంటుందని మండల విద్యాశాఖాధికారులు రాజాల కొండారెడ్డి, జగన్నాథం ప్రసాద్ రావులు అన్నారు. మండలంలోని శీలంవారిపల్లి హై స్కూల్ ప్లస్ కేజీబీ విద్యాలయాల్లో నిర్వహించిన మాతృభాష దినోత్సవం జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి దశలోనే మాతృభాషలో నేర్చుకోవడం వలన చాలా విషయాలు సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు మాతృభాషలో బోధన అందించడం వలన పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆలోచనల్లో సృజనాత్మకత పెంపొందుతుందని తెలిపారు హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా జరుపుకుంటున్న జాతీయ క్రీడ దినోత్సవం లో భాగంగా కెజిబివి విద్యాలయం శీలంవారిపల్లి హైస్కూల్లో క్రీడా సంబరాలు నిర్వహించారు క్రీడలు శరీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఇండియా మిషన్లో భాగంగా 3 రోజులపాటు కార్యక్రమాలు జరుగుతున్నాయని అందరూ విద్యార్థులు కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, ప్రధానోపాధ్యాయులు బి ప్రసాద్, సీఆర్పీ సతీష్ కుమార్, పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా, మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర - తర్లుపాడు : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా,మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ తెలిపారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటారని ఆయన తెలిపారు. తెలుగు - వెలుగు కార్యక్రమంలో తెలుగు వకృత్వపు పోటీ,పద్య పఠన నిర్వహించినట్లు తెలిపారు. వకృత్వంలో ప్రథమ బహుమతి బాసు పూజిత,ద్వితీయ బహుమతి ఆర్ దీపాన్విత,తృతీయ బహుమతి కే ప్రణీత గెలుపొందారని తెలిపారు. జూనియర్స్ పద్య పఠన పోటీలలో ప్రథమ బహుమతి మనోజ్,ద్వితీయ బహుమతి ఎలిజబెత్,తృతీయ బహుమతి ఆర్ దీపాన్విత గెలుపొందారున్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. కబడ్డీ వాలీబాల్లో ప్రతిభ చూపిన బాలికలు, బాలురు సీనియర్, జూనియర్లకు బహుమతులు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ తెలిపారు.

పటిష్ట భద్రత

(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. విగ్రహాల నిమజ్జనాల్లో ఎలాంటి అపశ్రుతులు లేదా అవాంతరాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రమాదాలు సంభవించకుండా అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు జరిగేలా చూడాలని, ట్రాఫిక్ను సమర్థవంతంగా నియంత్రించాలని, భక్తులు ఎక్కువ లోతులోకి వెళ్లకుండా, చిన్న పిల్లలు సముద్రంలో దిగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజఈతగాళ్లు, ఫ్లడ్ లైట్లు, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు వంటి అవసరమైన భద్రతా సామాగ్రి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గజఈతగాళ్లకు ప్రత్యేక టీషర్టులు అందజేయడం ద్వారా వారు తేలికగా గుర్తించబడేలా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. భద్రత చర్యల్లో భాగంగా మెరైన్ పోలీసులు కూడా సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ, వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియ కోసం పోలీసు శాఖ తరపున అన్ని భద్రతా మరియు బందోబస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, పటిష్ట భద్రతా ఏర్పాట్లతో జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా, పోలీసులు మరియు మెరైన్ పోలీసులు కలసి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో గజఈతగాళ్లను నియమించి, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచామని వివరించారు. గ్రామంలో వృద్ధులు, చిన్నపిల్లలు, మరియు అనారోగ్యంతో బాధపడుతున్నవారిని దృష్టిలో ఉంచుకొని, డీజే సౌండ్ మరియు మైకులను గ్రామంలో ఉపయోగించకుండా గ్రామం బయటే ఆపుకుని, అక్కణ్ణుంచి నిమజ్జనానికి బయలుదేరాలి. భక్తులు పోలీసులకు సహకరిస్తూ, సూచనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులు ప్రతిష్టించిన విగ్రహాలను కాలువలు, చెరువులు, నదుల వంటి నిమజ్జన ప్రదేశాల్లో ముందుగానే గుర్తించామని, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ స్టేషన్ అధికారులు కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని తెలిపారు.జిల్లా ఎస్పీ వెంట మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు టు టౌన్ సీఐ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్సై సుధాకర్, వెంకట కృష్ణయ్య, మెరైన్ ఎస్సై సుబ్బారావు, సిబ్బంది ఉన్నారు.

రైతు కోర్కెల దినోత్సవం విజయవంతం చేయండి

ఏపీ రైతుసంఘం నాయకులు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : సెప్టెంబర్ 1న జరుగు రైతు కోర్కెల దినం జయప్రదం చేయండి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డి శ్రీనివాస్, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య పిలుపునిచ్చారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి శ్రీనివాస్,బాణాల రామయ్య మాట్లాడుతూ పత్తి దిగుమతి సుంకం తగ్గింపు జీ.వో ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పత్తికి సి2౦50 ప్రకారం క్వింటాకు. 10,075 రూపాయలు మద్దతు ధర ప్రకటించాలి అన్నారు. గ్రామ గ్రామాన రైతులు తీర్మానం చేసి ప్రధానమంత్రికి పంపాలని డిమాండు చేశారు. భారత ప్రభుత్వం విదేశాల నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ జీ.వో ఇచ్చింది. అమెరికాలో వ్యవసాయ సబ్సిడీలు ఎక్కువ పత్తి తక్కువ ధరకు వస్తుంది అన్నారు. మనదేశంలో కంపెనీలు అన్నీ ఏడాదికి అవసరమైన పత్తిని దిగుమతి చేసుకొని నిల్వ పెట్టుకుంటాయి అన్నారు. మరొక మూడు మాసాలలో మన దేశంలో పత్తి వస్తుంది అప్పటికి గోడౌన్లు నిండా పత్తి నింపుకున్న కంపెనీలు పత్తి కొనుగోలు చేయవు అని వారు తెలిపారు. తద్వారా పత్తి కొనేవారు లేక మన రైతాంగం అతి తక్కువ ధరలకు వ్యాపారులకు తమ పత్తిని అమ్ముకోవాల్సి వస్తుంది. సుంకం తగ్గింపు వల్ల అమెరికన్ కంపెనీలకు మన పత్తి కంపెనీలకు లాభాల పంట పండుతుంది. దీనిద్వారా మన రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతుంది అన్నారు. మన దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలు అత్యధిక భాగం పత్తి రైతులే అని తెలిపారు. గత ఏడాదే మన పత్తి రైతాంగం మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకొని నష్టపాలు అవుతున్నారన్నారు. ఆగస్టు 15వ తేదీన ప్రధానమంత్రి మన దేశ రైతాంగానికి అండగా నిలబడతామని మూడుసార్లు వక్కాణించి చెప్పారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో గ్రామ గ్రామాన రైతులు సమావేశాలు జరపాలని, సుంకాల తగ్గింపు జీ.వో ఉపసంహరించాలని పత్తికి సి2050 ఫార్ములా ప్రకారం 10,075 రూపాయలు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ తీర్మానం చేసి ఆ తీర్మానాలను భారత ప్రధానమంత్రికి పంపాలని ఎస్కెఎమ్ పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో సమన్వయ సమితిలోని సంఘాలన్ని 1, 2, 3 తేదీలలో గ్రామ గ్రామాన కరపత్రాలు పంచడం, సమావేశాలు జరపడం క్యాంపైన్ గా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయసమితి కోరుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున,పట్టణ కార్యదర్శి కాశీం,సీనియర్ నాయకులు పవన్ కుమార్, శ్రీను,దాదా, నాగేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు
క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - తాళ్లూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిపించే బాధ్యత మండల స్థాయి అధికారులదేనని తాళ్లూరు మండల ప్రత్యే కాధికారి ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లూరు ఎంపీడీవో చాంబర్లోఎంపీడీవో సానికొమ్ముసత్యం అధ్యక్షతన మండలస్థాయి అధికారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన పథకాలు సక్రమంగా గ్రామస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల నిర్వహణలో సమస్యలు వస్తే తన దృష్టికి తీసుక వస్తే తగు చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లోప్రజల సమస్యలు విన్నవిస్తే ఆయాశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార మార్గం చూపాలన్నారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీలో సమస్యలు వుంటే తహసీల్దార్ను సంప్రదించి పరిష్కరించుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంగా గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించినా ఎందుకు పురోగతి లేదని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతంగా పూర్తి చేయించాలని ఉపాధి హామీ పథకం ఆధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బివిరమణారావు, హౌసింగ్ అధికారి హనుమంతరావు, ఏపిఎమ్ దేవ రాజ్, ఏపీవో వెంకటేశ్వరరావు. వైద్యాధికారి రాజేష్యాదవ్, ఆర్డబ్ల్యు ఎస్ఏఈ వాలి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు తొలి అడుగు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మహాకవి, వ్యవహారిక భాషోద్యమ కారుడు గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా శంకరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎన్ అరుణ కుమారి మాట్లాడుతూ వ్యవహారిక భాషకు తొలి అడుగు వేసిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా ఉన్నంతవరకు చిరస్మరణీయంగా ఉంటారన్నారు. తెలుగు వాడుక భాషగా రూపాంతరం చెందించడంలో గిడుగు కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో వి ప్రసాదరావు, ఎన్ ఇజ్రాయిల్, డి శ్రావణ్ కుమార్, వి చిరంజీవి శర్మ, వి.శ్రీనివాసరావు, ఏ.లేవీ ప్రసాద్, పి ప్రసన్నాంజనేయులు, జి పార్వతి, ఎన్ లీలా ఉమా, కే కోటేశ్వర కుమార్, టీ గాలీబి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని పలు ఎరువుల దుకాణాలపై ఎన్ఫోర్స్మెంట్ టీం అధికారులు డి.భాగ్యలక్ష్మి, తహసీల్దార్ కొమరోలు, కె.రాజశ్రీ, మండల వ్యవసాయాధికారి, కొమరోలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ లో భాగంగా కొమరోలులోని శ్రీ వాసవి వెంకట సాయి బాబా ట్రేడర్స్, వెంకట నాగ వాసవి ట్రేడర్స్, రైతు మిత్ర స్టోర్స్ దుకాణాలు మరియు గోడౌన్ లను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్వాయిస్లు, ఐఎఫ్ఎంఎస్ స్టాక్ మొదలైనవి తనిఖీ చేసి, యూరియ అవసరం ఉన్న రైతులకు మాత్రమే ఇవ్వవలెనని, పొలాన్ని మరియు వేసిన పంటను బట్టి యూరియ ఇవ్వవలెనని, మన జిల్లాకి కేటాయించిన ఎరువులు ఇక్కడ రైతులకు మాత్రమే విక్రయించాలని సూచించారు. ఎవరూ కూడా ఎంఆర్పి ధరలకు మించి అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టాక్ ఉంచుకొని లేవని రైతులను వెనక్కి పంపకూడదని తెలిపారు.

పెట్రోలు బంకులో తహసీల్దార్ తనిఖీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని నాగులప్పలపాడులోని పెట్రోలు బంకును తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పెట్రోలు సరఫరా అవుతుందా...? లేదా..? అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిలను సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా కొలత ప్రకారం పెట్రోలు, డీజిల్ను అందజేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మద్దిరాలపాడు గ్రామంలోని ఆర్వో ప్లాంటును తనిఖీ చేశారు. నీటి నాణ్యతను పరిశీలించారు. సమయం ప్రకారం ఫిల్టర్లు మార్చాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పులి మళ్లీ వచ్చింది..?



కంభం, క్రిష్టపురం గ్రామాల్లో పొలాలకు కూలీలు పులి భయంతో పనులకు రావటం లేదని రైతులు వాపోతున్నారు.

విశాలాంధ్ర -కంభం : కంబం మండల ప్రజలు పులిభయంతో వణుకుతున్నారు. గత పదిహేను రోజులవ్యవధిలో మండలంలోని సైదాపురం, నడింపల్లి, ఎల్ కోట, ఔరంగాబాద్ గ్రామాల్లో పులి సంచరిస్తుందని గ్రామాల్లో ప్రజలు భయంతో గడిపారు. అటవీశాఖ అధికారులు కెమెరాలు, నెట్లు ఏర్పాటు చేసిన పులి జాడకనబడలేదు. మళ్ళీ దర్గాగ్రామంలో పులిఅడుగుజాడలు కనబడటంతోప్రజలు భయాందోనలు చెందుతున్నారు. గురువారం బెస్తవారి పేట మండలం జగంబొట్ల కృష్ణాపురం గ్రామా రైల్వే గేట్ కొండా పైనుంచి పులివచ్చినట్లు అడుగులు ఉన్నాయని ఎఫ్ఆర్ఓ ఆంఆంధ్రరావు తెలిపారు. అక్కడనుండి కంభం మండలం దర్గా గ్రామం పొలాల్లో సంచరిస్తున్నట్లుగా రైతులనుండి సమాచారం వచ్చిందని ఎఫ్ఆర్ఓ అన్నారు. సకాలంలో వరుసలు పడటంతో రైతులు పంట పొలాల్లో ఉంటున్నారు. పులి భయంతో పొలాలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో ఉంచుకోని వెళ్లవల సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు ..ఏసమయంలోఎటునుంచి వచ్చిపులి తమపై దాడి చేస్తుందో నని రైతులు అల్లాడుతున్నారు. జిల్లా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టి జల్లెడ గాలింపుచర్యలు చేపడితేగాని పులిని బందించవచ్చని ప్రజలు కోరుతున్నారు.

భయంగుపిట్లో రైతులు :

నిత్యం కూలీలతో పంటపొలాల్లో ఉంటున్నామని పులి సంచరిస్తుందనే పుకార్లు జరగడంతో పాటుగా పులి అడుగుజాడలు కనబడటంతో భయం బలం నాటుకుపోయిందని రైతులు దిగాలు చెందుతున్నారు .దర్గా,చిన్న

భయపడవద్దు

: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు :

గ్రామాల్లో ప్రజలు భయపడవద్దని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావుసూచించారు. పంటపొలాలకు ఒంటరిగా వెళ్లవద్దని, తమ చేతుల్లో కర్రలు ఉంచుకోవాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట పడుకోవద్దని అన్నారు. పులి సంచరిస్తుందని సరైన ఆధారాలు లేవని పులి అడుగుజాడలుపై మట్టి ఆత్మకూరు అటవీశాఖ ల్యాబ్కు పంపినట్లు తెలిపారు. శుక్రవారం తమ శాఖ సిబ్బందితో పది టీములుగా గాలింపుచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా సిసి కెమెరాలు అనుమానాస్పదమైన చోట అమర్చినట్లు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : రేషన్ షాపు డీలర్లు, పెట్రోల్ బంకు నిర్వాహకులు, రైస్ మిల్లుల వారు ఎలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద్దఉల్లగల్లు, వేముల బండ, పసుపుగల్లు గ్రామాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షాపుల నిర్వాహకులు స్టాక్ రిజిస్టర్, ఆన్లైన్ నిల్వలకు సరిపడేలా నిల్వలు ఉండేలా చూసు కోవాలన్నారు. ఉద్దేశపూర్వకంగా నిల్వలో తేడాలు చూపిస్తే షాపు సీజ్ చేసి 6 ఏ కేసు నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుజాత పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళు న్న వ్యక్తి అదుపుతప్పి కింద పడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇతను వినుకొండకు చెందిన వ్యక్తిగా తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల పర్యవేక్షణలో వినాయక నిమజ్జనాలు

- నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలి
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే సహించేది లేదు..
- పోలీస్ సిబ్బందికి సీఐ హాజరత్తయ్య సూచనలు

విశాలాంధ్ర - సింగరాయకొండ: సాగర తీర ప్రాంతం నందు గణేష్ నిమజ్జనాలు పోలీసుల పర్యవేక్షణలో సింగరాయకొండ మండలం పాకల గ్రామంలో

యాప్సై బి మహేంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ శుక్రవారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని, ప్రజలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అన్నారు. గ్రామ పరిధిలో ఉన్న సముద్రం తీరాన్ని పరిశీలించి వినాయక నిమజ్జనం ప్రదేశాలలో గజ ఈతగాళ్ళను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని, ఎలాంటి అవాంతనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని హెచ్చరించారు. అంతరం వినాయక నిమజ్జనం ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒక ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసి వినాయక నిమజ్జనం విచ్చేసిన ప్రజలకు ప్రజలకి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసినారు. అదేవిధంగా రాత్రివేళ నిర్ణీత సమయంలో మాత్రమే నిమజ్జనానికి ప్రవేశ ఉంటుందని సూచించారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాల నడపటం, సముద్రంలోకి ప్రవేశించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటించి పోలీసువారికి సహకరించవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, గణేశుని నిమజ్జన సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర- వెలిగండ్ల : మండలంలో సర్వేలు పారదర్శకంగా నిర్వహించాలని, సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని మొగుళ్లూరు, నాగిరెడ్డిపల్లి తదితర సచివాలయాలను తనిఖీ చేసి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని రకాల సర్వేలను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రజల కోసం ఏ సంక్షేమ పథకం ప్రవేశపెట్టిన ప్రజలకు వివరించి సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉంటుందని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది సేవలు విస్తృతం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సిబ్బంది సమయపాలన పాటించాలని సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిటీ సభ్యులకు దామచర్ల సత్య అభినందనలు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరు లోని చెన్నకేశవ స్వామి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం అయిన సందర్భంగా రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్, డైరెక్టర్ దామచర్ల సత్య ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులను అభినందించారు. ముఖ్యంగా కొల్లూరు సుధాకరరావును కార్యదర్శి అంజనా దేవిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కెన హరిబాబు, సర్పంచి మమత నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సై సాంబశివరావుకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పెద్దారవీడు : పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టినటువంటి సాంబశివరావుని పెద్దారవీడు మండల వైఎస్ఆర్సిపి నాయకులు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు వెన్నా శివ కృష్ణారెడ్డి,జిల్లా బీసీ సెల్ కార్యదర్శి కేశయ్య గౌడ్,నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు గుర్రం ముత్యాలయ్య యాదవ్, మండల యువ నాయకులు ఏర్వ శేష సేన రెడ్డి ,మండల వైస్ కన్వీనర్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ తోకల ఆవులయ్య యాదవ్, వైస్ ఎంపీపీలు గుండారెడ్డి వెంకటేశ్వర రెడ్డి,పోటు గంగయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రేగుమాని పల్లి సర్పంచ్ పాలగిరి వెంకట రామాంజిరెడ్డి సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు, సుంకేసుల సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, సానికవరం సర్పంచ్ మూల రమణారెడ్డి, కంభంపాడు సర్పంచ్ బెజవాడ ఆదాం, ఎంపీటీసీలు, గొట్టం గోపాల్ రెడ్డి, నాయకులు షేక్ జైలునుద్దీన్, అల్లు వెంకటేశ్వరరెడ్డి,పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, యువ నాయకులు అల్లు బాలరామిరెడ్డి, మారారెడ్డి శివారెడ్డి, సింగారెడ్డి శివారెడ్డి,కొల్లి వెంకటేశ్వర్లు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగినది.

ఘనంగా గణేష్ ఉత్సవాలు

విశాలాంధ్ర-పామూరు : మండలంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా ఆగుతున్నాయి. 27వ తేదీన మండపాలలో కొలువుదీరిన గణనాథులు పండ్లు, ఫలహారాలు, నిత్య పూజలతో ఆరాధింపబడుతూ భక్తులు తమ కోర్కెలను తీర్చు కుంటున్నారు. మూడవ రోజు శుక్రవారం పలు గ్రామాలలో ఉట్టి కొట్టుట నిర్వహించి గులాలు చల్లుకుంటూ యువత కేరింతలతో నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో తూర్పు వీధి వినాయకుడి గుడి వద్ద, వైయస్సార్ రోడ్డు లోను, సత్యనారాయణ పురం, కందుకూరు రోడ్డు మొదలగు వినాయక మండపాలు వద్ద అన్నదానం నిర్వహించారు.

కందుకూరు రోడ్డులో : సిఎస్‌పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండల తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు, సిఐ ఎం భీమానాయక్, ఎస్ఐ టి.అశోక్ బాబు, తూర్పు వీధి వినాయకుడు గుడి వద్ద ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ఇరికోటి రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు మెంటా నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి జి.అరవింద రెడ్డి సత్యనారాయణ పురం, వైయస్సార్ రోడ్డు విగ్రహాల వద్ద వైసీపీ మండల అధ్యక్షులు గంగదాని హుసేన్ రెడ్డి, కరెంట్ ఆఫీస్ వినాయక విగ్రహం వద్ద ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్ , మాజీ సింగల్ విండో అధ్యక్షులు చల్లా సుబ్బారావు, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తెలుగు వ్యవహారిక భాష ఉద్యమకారుడు 'గిడుగు'

విశాలాంధ్ర-పామూరు : తెలుగు వ్యావహారిక బాషా ఉద్యమకారుడు గిడుగు వెంకట రామమూర్తి, హాకీ మాంత్రికుడు భారత రత్న ధ్యానచంద్ జయంతి వేడుకలను స్థానిక ఐదోవ వార్డ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు శుక్రవారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ జీవిత విశేషాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ముందుగా గిడుగు, ధ్యాన్చంద్ చిత్రపటాలకు పూలమాలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రవి,టి.వెంకటేశ్వరావు, పద్మావతి, తోట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలకు సహకరించండి

విశాలాంధ్ర - గిద్దలూరు : పట్టణంలో పారిశుద్ధ్యని మెరుగుపరిచేందుకు ప్రజలు సహకరించాలని గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. శుక్రవారం ఆయన ఉదయాన్నే పట్టణంలోని ఆయా విధులలో పర్యటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ గిద్దలూరు సాధించేందుకు ప్రో ప్రజలు అధికారులు ప్రజాప్రతినిధులు సహకరిస్తే జిల్లాలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా అభివృద్ధి పథంలో నిలపవచ్చు అన్నారు. ప్రస్తుతం పట్టణంలో పర్యటించి ఎక్కడ పారిశుద్ధ లోపం ఉందో గుర్తించి వెనువెంటనే మెరుగుపరిచే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గృహాల ముందు పారుతున్న కాలువలో ప్లాస్టిక్ సంచులు చెత్తాచెదారం వేయడం వల్ల పరిశుద్ధ లోపం ఏర్పడు తుందన్నారు. ఏమైనా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటే వెంటనే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. అయన వెంట మునిసిపల్ అధికారులు టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ పందిటి రజిని బాబు ఎస్సీ సెల్ నాయకుడు గుర్రం దానియేల్ చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

కొమరోలు పోలీస్ స్టేషన్‌లో

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు పోలీస్ స్టేషన్‌లో వినాయక చవితి పండుగ వేడుకలు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు పోలీస్ స్టేషన్ ఆవరణలో విగ్రహాన్ని ఏర్పాటుచేసి పోలీసు సిబ్బంది పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం గణపయ్యను ఊరేగింపుగా తీసుకువెళ్లి బాదినేనిపల్లి పులి వాగులో ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ మునఫ్, పోలీసు సిబ్బంది మేము కలిసి నిమగ్నం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు యువత కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయాన్నే త్వరగా వినాయక చవితి వేడుకలు ముగించిన ఎస్సై నాగరాజు పోలీసు సిబ్బంది మధ్యాహ్నం నుంచి కొమరోలు పట్టణంలో జరిగే గణేష్ నిమజ్జనం వేడుకలకు పటిష్ట బందోబస్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా గణేష్ నిమజ్జనం పూర్తయ్యాలా

చూస్తామని ఎస్ఐ నాగరాజు అన్నారు.

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో రెండవ రోజు గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వినాయక చవితి సందర్భంగా మండలంలో సుమారు 94 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మండల కేంద్రమైన ముండ్లమూలలో శ్రీకృష్ణ యాదవ్ ల ఆధ్వర్యంలో 13 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసినారు. ప్రతిరోజు నిత్యం పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వినాయకుని వద్ద జమ్ముల నాగేశ్వరరావు, కోటేశ్వరి దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. గణనాథుడు చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకొన్నారు. పూజారి దుర్భాకుల నగేష్ శర్మ వేద మంత్రోచ్చరణలతో పూజలు సాగాయి.

గణేష్‌కు 'దద్దాల' పూజలు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని బొట్ల గూడూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహానికి కనిగిరి వైసీపీ ఇన్చార్జ్ గద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నారాయణ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, జడ్పీటీసీ జడ్పిటి సుబ్బయ్య సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, గ్రీవెన్స్ రాష్ట్ర కార్యదర్శి గట్ల విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన

ప్రభుత్వ భూములను కాపాడండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు బాపట్ల మండలం తహసీల్దార్ షలిమాకి అర్జీ అందజేశారు.మండలంలోని తూర్పు బాపట్ల,పడమర బాపట్ల రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని నిరుపేదలకు కేటాయించాలని బీఎస్పీ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్జీ అందించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుడే రాజారావు మాట్లాడుతూ తూర్పు బాపట్ల పడమర బాపట్ల పరిధిలో మాజీ ప్రజా ప్రతినిధులు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని,భూమిలేని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు.అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ఎక్స్ ఎంపీ మాదాల నారాయణస్వామి కాలనీ వాసులకు ఎస్సీ,ఎస్టీ,బీసీలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.భూ బదిలీ నిషేధిత చట్టం1977,ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎన్. యువరాజ్ ఇచ్చిన జడ్జిమెంట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన శక్తి రాష్ట్ర నాయకులు శీలం రోజన్ బాబు, బీఎస్పీ నాయకులు పాలపర్తి సంతమ్మ, కోప్పూరి రాజారావు,యేపూరి జోసఫ్,తగరం రవికుమార్,మంచాల ఆనంద్ ఉదయ్ కిరణ్,కోలా శరత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.ఆటల పోటీలు, వ్యాసరచన,వక్తృత్వం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు కాటూరు వెంకట్రావు, ఉల్లగంట వెంకటేశ్వరరావు,నాగమల్లేశ్వరరావులను దృశ్యాలువలు పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరు లక్ష్మీనారాయణ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

1న పింఛన్ అందజేయాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రతి నెల ఒకటో తేదీన పెన్షన్ నగదు తప్పనిసరిగా పింఛను దారులకు అందించాలని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభానీ అన్నారు.శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ ఆదివారం కాబట్టి శనివారం పెన్షన్ నగదును బ్యాంకుల నుంచి డ్రా చేయవలసిందిగా కార్యదర్శులను ఆదేశించారు.

వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు...

విశాలాంధ్ర - సంతమాగులూరు : పుట్టావారిపాలెం జంక్షన్ కూడళ్లలో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది.ప్రధాన కూడలి నరసరావుపేట రోడ్డులోనే ఎక్కువగా రద్దీ నెలకొంది.ఇటువైపు హోటళ్లు,టీ,టిఫిన్ దుకాణాలు ఉండటం వలన సాయంత్రం వేళల్లో ద్విచక్ర వాహనదారులు అక్కడికి చేరుకుని రోడ్డు పక్కనే నిలుపుదల చేస్తున్నారు.దీంతో ఇతర వాహనాలు,పాదాచారులు అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వినుకొండ,అద్దంకి,రొంపిచర్ల రోడ్లలో కొంతమేరకు ఫర్వా లేదు.ఈ విషయంలో పోలీసు అధికారులు చొరవ తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సాగులో సేంద్రియ పద్ధతులు పాటించాలి: సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - జె.పంగులూరు : రసాయనక ఎరువుల వాడకం తగ్గించి సారవంతమైన నేలల కోసం సేంద్రియ ఎరువుల వాడకం మంచిదని వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు.శుక్రవారం కొండమూరు సచివాలయం వద్ద వ్యవసాయ అధికారి డి.సుబ్బా రెడ్డి అధ్యక్షతన ఆత్మ ప్రకాశం వారి సౌజన్యంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకంతో భూమిలో సమతుల్యత కోల్పోయి,పంటలపై చీడపీడలు ఆశిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విభాగం నుండి శిరీష పాల్గొని బీజామృతం, ఘన,ద్రవ బీజామృతాలు తయారీ శాఖ బెల్లం కషాయం తయారీ విధానము,పిఎండిఎస్ విత్తన కిట్లు సాగు చేయడం వలన కలిగే ఉపయోగాలు గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కాటా అంజయ్య,మక్కెన శ్రీనివా సరావు,రైతు సేవ కేంద్ర అధికారులు మస్తాన్,సాయి కృష్ణ,మస్తానయ్య గ్రామ రైతులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి సేవలు నిరుపమానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని,అలాంటి వృత్తికే వన్నెతెచ్చిన విజయలక్ష్మి సేవలు నిరుపమానం అని ఎంఈఓ వేమవరపు కోటేశ్వరరావు అన్నారు.శుక్రవారం ఏల్చూరు మండల పరిషత్ ప్రాథమిక (హిందూ) పాఠశాల ప్రధానోపాధ్యాయిని పల్లెపోగు విజయలక్ష్మి,ప్రకాష్ ఉద్యోగ విరమణ సన్మానసభ ఘనంగా నిర్వహించారు.తొలిత ఉపాధ్యాయిని ఆదిలక్ష్మి కుమారి అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు.అతిథులుగా ఎంఈఓ కోటేశ్వరరావు,ఎంఈఓ-2 దార్ల దినేష్ కుమార్ హాజరయ్యారు.ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ హెచ్ఎం విజయలక్ష్మి ఉపాధ్యాయినిగా తొలి పోస్టింగ్ ఏల్చూరు హిందూ స్కూల్‌లోనే, పదవీ విరమణ సైతం ఇదే స్కూలు కావడం గమనార్హం అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు అందరూ విజయలక్ష్మి,ప్రకాష్ దంపతులను శాలువాలు,పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దుద్దేల చిన్న గాలెయ్య,తాత్కాలితం దేశింగ రాజు,నక్కా వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ నక్కా చిన్న సాంబయ్య, ప్రధానోపాధ్యాయులు దారా బాలయ్య,డేవిడ్,మాధవి పుష్పమి,టీచర్లు అంతోనిదాస్, రామాంజనేయులు,పూర్ణచంద్రరావు,పేరయ్య,పసుపులేటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు,మిట్టా శ్రీనివాసరావు,వలిఖాన్,శేఖర్ బాబు,ముస్తఫా, వీఆర్వో షేక్.షఫీ,రిటైర్మెంట్ టీచర్లు చంద్రశేఖర్,సుబ్బారావు, కోటేశ్వరరావు,పూర్వ విద్యార్థులు సురేంద్ర,చెంచారావు, హనుమంతు,బాజీ పాల్గొన్నారు.

క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం

❍ వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : క్రీడలు ఆరోగ్యానికి మానసిక ఉల్లాసానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి అన్నారు.విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించబడిన జాతీయ క్రీడా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రీడలు విద్యార్థులలో అంతర్లీనంగా ఉండే సామర్థ్యాన్ని వెలికితీసే అసాధారణ ప్రక్రియలను,వారి మేధోసంపత్తిని పెంపొందింప జేసే శక్తి వాహకాలని,అవి ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టడమే కాకుండా ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింప జేస్తాయన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యాన్ని ఇవ్వాలన్నారు. విద్యార్థులు అయోధ్యలో జరిగిన జాతీయ క్రీడలలో షటిల్,వాలీబాల్,టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్,అథ్లెటిక్స్ పోటీలలో రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. తొలుత ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ పులి మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఫిజికల్ డైరెక్టర్ వై.అంకమ్మ, మహిళా ఫిజికల్ డైరెక్టర్ బి.మౌనిక,బోధన బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

నాటు కోళ్ల పెంపకంతో ఆదాయం

విశాలాంధ్ర - వేమూరు : డ్వాక్రా మహిళలు కోళ్ల పెంపకం ద్వారా ఆదాయ వనరులు పెంపొందించుకోవచ్చని ఏపీఎం శోభన్ బాబు తెలియజేశారు.శుక్రవారం మండల సమైక్య ద్వారా కోళ్ల పెంపకం యూనిట్లను పంపిణీ చేశారు.పెరటి కోళ్ల పెంపకం ద్వారా డ్వాక్రా మహిళలు ఆదాయం పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.అందులో భాగంగానే వేమూరు మండలంలో డ్వాక్రా మహిళలకు 60 కోళ్ల యూనిట్లను తొలివిడతగా పంపిణీ చేయడం జరుగుతుందని, రూ.5000లు వరకు ఉంటుందని అందులో పది కోళ్లు,కోళ్లకు సంబంధించి నటువంటి దాన, వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. డ్వాక్రా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలన్నారు. టీడీపీ నాయకులు షేక్ అనీఫ్,సిసిలు గోల్డ్ మేరీ,డ్వాక్రా మహిళలు ఉన్నారు.

ప్రజా దర్బార్‌లో మహేంద్రనాథ్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చీరాల టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. తెదేపా చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం,ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్‌రావు జనసేన నాయకులు కారంపూడి పద్మిని,నాగలక్ష్మి ,గాయత్రి,సయ్యద్ బాబులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక క్రేన్లు ఏర్పాట్లు

సీఐ మల్లికార్జునరావు

విశాలాంధ్ర - రేపల్లె : వినాయక చవితి పండుగ సందర్భంగా రేపల్లె పట్టణ పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి రేపల్లె మండలం పెనుమూడి-పులిగడ్డ వారధిపై రేపల్లె పోలీసు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఆయా విగ్రహాలను కృష్ణా నదిలో క్రేన్ల సహాయంతో నిమజ్జనం చేస్తున్నట్లు ఇందులో పోలీస్,రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ వారికి విగ్రహాల కమిటీ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు భక్తబృందం సహకరించాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట పైరుతో భూసార పరిరక్షణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని గవినివారిపాలెం గ్రామంలో ఏటిఎంఎ ఆధ్వర్యంలో భూసార పరిరక్షణ మీద అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బాపట్ల ఆర్.ఎస్.టి.ఎల్ వ్యవసాయ అధికారి ఐ.సుమతి మాట్లాడుతూ భూసార పరిరక్షణకు మొదటగా పచ్చిరొట్ట పైరును వేసుకున్నట్లయితే భూమిలో కర్బన శాతం పెరిగి భూమి యొక్క జీవజాలం కూడా పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. భూమిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుందని రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవడం ద్వారా భూమి యొక్క భౌతిక స్వభావాన్ని మెరుగుపరచుకోవచ్చున్నారు. భాస్వరం ఉండే ఎరువులను దుక్కిలో మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. లేకుంటే నేల చౌడువారు తుందన్నారు. చీరాల మండల వ్యవసాయ అధికారి పి.నిర్మలాదేవి మాట్లాడుతూ రైతులందరూ భూములను తక్కువ రసాయన ఎరువులతో సాగు చేసుకుని మంచి దిగుబడులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బిటిఎం జ్యోతి, మనీషా, ఏపీ సీఎంఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా విజయ్‌కుమార్

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : వైయస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా పిట్టలవానిపాలెం మండలానికి చెందిన వైసీపీ నాయకులు మండే విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. తనపై ఉన్న నమ్మకంతో తనను నియమించిన వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అలాగే తన నియమకానికి కృషిచేసిన బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ జిల్లా అధ్యక్షులు మేరుగు నాగార్జునలకు మండే విజయ్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు గట్టి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు నియామకం

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని వైసీపీ మండల యువజన విభాగ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. బాపట్ల మున్సిపాలిటీకి యువజన విభాగ అధ్యక్షులుగా ఊరబండి గోపి, బాపట్ల మండలంకి యువజన విభాగ అధ్యక్షులుగా వడ్డిముక్కల రవితేజ, కర్లపాలెం మండలంకి యువజన విభాగం అధ్యక్షులుగా చిక్కాల సాగర్, పిట్టలవానిపాలెం మండలానికి యువజన విభాగ అధ్యక్షులుగా షేక్ మౌలాలిలను నియమించి నట్లు బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కోకిలగడ్డ చెంచయ్య తెలిపారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

విశాలాంధ్ర -చీమకుర్తి : చీమకుర్తి పురపాలక సంఘ కార్యాలయం నందు తేదీ 30-08 -2025 శనివారం నాడు ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం చైర్ పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడమైనది. కావున కౌన్సిల్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరడమైనదని మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు.

ఉప ప్రణాళిక నిధులతో దళిత గిరిజనుల అభివృద్ధి

- దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఉప ప్రణాళిక నిధులు దళిత గిరిజనుల అభివృద్ధికి వినియోగించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్ అన్నారు. దళిత గిరిజన నాయకులు ఎస్సీ,ఎస్టీల కోసం రూపొందించబడిన ప్రత్యేక చట్టాలపై అవగాహన పెంపొందించుకుని ఆయా వర్గాలకు అండగా నిలబడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ వాచ్ జిల్లా కన్వీనర్ వి.భగవాన్ దాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ అభివృద్ధి కోసం రూపొందించబడిన అత్యాచారాల నిరోధక చట్టం, సబ్ ప్లాన్ చట్టాలు సమర్ధవంతంగా అమలు జరిగే విధంగా పర్యవేక్షించాలన్నారు. సబ్ ప్లాన్ ద్వారా నిధులు పొంది వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న పథకాలను అర్హులు అందుకునే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని, కేటాయించిన నిధులు వందశాతం ఖర్చు చేసే విధంగా క్షేత్ర స్థాయిలో పని చేయాలని కోరారు. దళిత నాయకులు యాతం మోజేష్‌రాజు మాట్లాడుతూ సిటిజన్ ఆడిట్ నివేదిక ప్రకారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అత్యాచారాల నివారణ చట్టం 1989లో వచ్చిందని 2023లో నమోదైన అత్యాచారాల మొత్తం సంఖ్యలో తగ్గుదల చూపించినప్పటికీ ఇది ఆందోళన కలిగించే అంశంగా చట్టంలోని నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. న్యాయవాది దగ్గుమల్లి కిరణ్ కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాలపై అమలుకు రోజుకు సగటున 7 అత్యాచారాలు నమోదు అవుతున్నాయని, ప్రతి వారానికి 4 అత్యాచారాలు ప్రతి నెల 5 హత్యలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వెళ్లబుచ్చారు. 2023 సంవత్సరంలో నమోదైన కేసులు సంఖ్య 12.6శాతానికి తగ్గినప్పటికీ షెడ్యూల్ కులాలపై జరిగిన హత్యల సంఖ్య 2022లతో పోలిస్తే యధావిధిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్సి స్టేట్ మహిళా కోఆర్డినేటర్ హేమలత, ఏరియా కోఆర్డినేటర్ శ్రీలత, అల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాగిత కోటేశ్వరరావు వివిధ ప్రజా సంఘాల నాయకులు దేవరకొండ రాము, గుదే రాజారావు, కంచర్ల చిట్టిబాబు, కొలా శరత్, నరసింహులు, పి.ప్రసాద్, టి.శంకర్ ప్రసాద్, ఎం.ప్రభాకర్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు,ధ్యానచంద్ జయంతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : కుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్, తెలుగు వాడుక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య ఆధ్వర్యంలో ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగంలో హాకీని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మేజర్ ధ్యానచంద్ అని తెలిపారు. విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. క్రీడలు ద్వారా క్రమశిక్షణ, ఐకమత్యం, సమష్టి భావనతో పాటు ఆరోగ్య పరిరక్షణ వంటి విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. మాతృభాష కోసం ఒక ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని పేర్కొన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

వేటపాలెంలో...

విశాలాంధ్ర - వేటపాలెం : జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వేటపాలెం జడ్పీహైస్కూల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్, వ్యవహారిక తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి విగ్రహాలకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి హెచ్ఎం మాట్లాడుతూ 1928,1932,1936 ఒలింపిక్ హాకీ పోటీల్లో భారతదేశానికి వరుసగా మూడు స్వర్ణ పతకాలు అందించడంలో ధ్యాన్ చంద్ కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాజుగట్టులో డ్రోన్‌ను ప్రారంభించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని దేవరాజుగట్టు గ్రామంలో శుక్రవారం మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ డ్రోన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ నూతన విధానంలో ఎన్నో మార్పులు వస్తున్న నేపథ్యంలో ఈ డ్రోన్ ద్వారా రైతులు పొలాలలో ఎరువులు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఎన్. లక్ష్మీనారాయణ, మండల టీడీపీ కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, సర్పంచులు అకుమల్ల శ్రీనివాసరెడ్డి, ఇండ్ల రామకృష్ణారెడ్డి, గుమ్మా గంగరాజు, సొసైటీ డైరెక్టర్ అనుముల ప్రసాద్, నాయకులు ఆనేకాళ్ళ శ్రీనివాసరెడ్డి, జి.రామనారాయణరెడ్డి, సిహెచ్.సుబ్బారామిరెడ్డి,డి. కొండారెడ్డి,కె.కాశిరెడ్డి,వి.సుబ్బారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా,జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బలహీన వర్గాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైస్కూల్ జి.ప్రధానోపాధ్యాయులు డాక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ తెలుగు భాష 56 అక్షరాలతో, ఆరు లక్షల పదాలతో సమృద్ధిగా ఉండి ప్రపంచ భాషల్లో విశిష్ట స్థానం పొందిందన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థులు అనేక బహుమతులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడి నిజమని, ఈ ప్రాంతం క్రీడల్లో ముందంజలో ఉంటుందని తెలిపారు. అంతేకాక పదో తరగతి విద్యార్థుల కోసం స్కూల్ బెంచీల ఏర్పాటు నిమిత్తం లక్ష రూపాయలు అందజేయడానికి సంఘం సిద్ధమైందని ప్రకటించారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయిని మౌనిక, ఉప ప్రధానోపాధ్యాయులు, తెలుగు పండిట్ శ్రీనివాసరావు, సంఘం సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, సభ్యులు శరత్ బాబు తదితర ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను మరియు తెలుగు భాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల పి. శ్యామ్ ప్రసన్న తాంజలి ఎస్. అనసూయ దేవి, వ్యాయామోపాధ్యాయులు పి. రామా నాయక్, హెచ్ . రామా నాయక్‌లు క్రీడా జ్యోతి ప్రజ్వలన , ప్రతిజ్ఞ చేసి ,మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి, గిడుగు రామ్మూర్తిబి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా పి.శ్యామ్ ప్రసన్న తాంజలి,ఎస్.అనసూయ దేవి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోను ముందంజలో ఉండాలని, ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారు పి. శ్యాం ప్రసన్న తాంజలి, ఫిజికల్ డైరెక్టర్ పి.రామా నాయక్ , హెచ్. రామా నాయక్, సీనియర్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు జి. విజయ మాణిక్యం, వి. నాగ మూర్తి , ఎస్. అనసూయ దేవి, షేక్.రహమత్ , టి.

వెంకట శివ, షేక్. అబ్దుల్ సలాం, డి. పోలయ్య , కె. కిరణ్ కుమార్ , కె. శిరీష రాణి, షేక్. మహబూబ్ బి, ఎం.కె.మహా దేవి, కె. ఆవులయ్య ,కె. ప్రసాద్ (ఆర్ట్), యం. అనిత(వర్క్ ఎడ్యుకేషన్), ఒకేషనల్ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్(ఐ.టి), టి. నరేష్ (అగ్రికల్చర్), యన్. కార్తీక్ (ఎలక్ట్రానిక్), ఉపాధ్యాయేతర సిబ్బంది బి.సి.హెచ్.శ్రీరామ్,రామా సుబ్బారెడ్డి, డి. మధు, టి. సౌమ్య , జెడ్.సౌజన్య, ఎస్.యం.ఎస్. చైర్మన్ షేక్. ఖాదర్ వలీ, మొదలగు వారు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన వైసీపీ యువ నాయకులు

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండలంలోని పలువురు వైసీపీ యువ నాయకులు శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం చెన్నై కి వెళ్లారు. ఈ సందర్భంగా మండలానికి చెంది వ్యాపార రీత్యా చెన్నైలో ఉంటూ చెన్నైలో సైతం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు వైసీపీ యువ నాయకులు తనను కలిసేందుకు జగన్మోహన్ రెడ్డి అవకాశం కల్పించారు. జగన్మోహన్ రెడ్డిని కలిసిన వారిలో మండలంలోని ముండ్లపాడు గ్రామానికి చెందిన పులి రామచంద్రారెడ్డి, పులి చంద్రశేఖర రెడ్డి, పులి మాల్యాద్రి రెడ్డి, డీజీ పేట కు చెందిన మితికేల వరుణ్ కుమార్, అరవ శ్రీనివాసులు, కంభంపాడు కు చెందిన మర్రి రమేష్, సిఎస్పురం కు చెందిన డాన్ శ్రీను, తోట రమేష్, నల్లమడుగులకు చెందిన బసిరెడ్డి పుల్లారెడ్డిలు ఉన్నారు.

ఉరివేసుకొని బాలిక ఆత్మహత్య

విశాలాంధ్ర - చీమకుర్తి : చీమకుర్తి కె.వి పాలెం రోడ్డులో జగనన్న కాలనీలో ఉంటున్న మెకానిక్, ఆమె తల్లి సిపిఎస్‌లో పనిచేస్తున్నది, కుమార్తె మైనరు ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. పోలీస్ సిబ్బంది,సీఐ ఎం.సుబ్బారావు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు బిగ్‌హెల్ప్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - తర్లుపాడు : బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తర్లుపాడు మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది పేద విద్యార్థులకు, ఒక్కొక్కరికి 350 రూపాయల చొప్పున,7000 వేల రూపాయల విలువగల విద్యా సామగ్రిని అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జూలై మాసం వరకు అవసరమైన విద్యా సామాగ్రిని అందజేసినట్లు తెలిపారు.ఈ విధంగా విద్యార్థులకు వారికి అవసరమైన విద్యాసామాగ్రిని 15 సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా ప్రతి నెల విద్యాసామాగ్రిని అందించడం గొప్ప హర్షనీయమని బిగ్ హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోసు శ్రీనివాసులు, అవార్డు డైరెక్టర్ కె ప్రదీప్ కుమార్, బిగ్ హెల్ప్ సంస్థ వారికి ప్రత్యేకంగా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయులు ఎం సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

నిమజ్జనానికి తరలిన గణనాధులు

విశాలాంధ్ర-పీసీపల్లి : వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో వీధి వీధినా కొలువుతీరిన గణనాధులు మూడు రోజులుగా నిత్యం పూజలు అందుకొని మూడో రోజు అయిన శుక్రవారం పలు గ్రామాలలో వినాయక నిమజ్జన వేడుకలను నిర్వాహకులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు లడ్డు వేలం పాట అనంతరం గణనాథులను తరలించారు. మండలంలోని పెదఅలవలపాడులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనంలో భాగంగా కళాకారులు చేసిన విన్యాసాలు ప్రజలను వింతగా ఆకట్టుకున్నాయి.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో రెండో విడత ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి శుక్రవారం అందజేశారు. మండలంలోని ఇరుసలగుండం, పెదారికట్ల, చిన్నారి కట్ల, గని వానీ,పాడు, సిద్ధవరం, చిన్నమన గుండం, గార్లదిన్నె, కొనకనమిట్ల వాగు మడుగు. గ్రామాలలో ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న 9 మందికి 10 లక్షల 36వేల 4 29 రూపాయలు చెక్కులను ఆయా గ్రామాల్లోని వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వెలుగొండ దేవస్థానం చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, మండల టిడిపి జనరల్ సెక్రెటరీ

భాషాపతి నాయుడు రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు కనకం నరసింహారావు ,తెలుగు యువత నాయకులు పెరికేసుకుదేవ్ ముప్వా కాటమరాజు మండల బీసీ సెల్ అధ్యక్షుడు అంకాల రోశయ్య, నీటి సంఘం అధ్యక్షులు దేవి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కేశవులు కిలారి బొంతయ్య బాపతి కృష్ణారెడ్డి అంబోరు రమణయ్య ,వేపాటి శ్రీకాంత్ రెడ్డి ముక్కాల శ్రీనివాసులు రెడ్డి , టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

19 లక్షల ధర పలికిన వినాయక కలశం

విశాలాంధ్ర-సిఎస్‌పురం : మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గణపతి మండపం వద్ద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలశం వేలం నిర్వహించారు వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలంలో కలశం అక్షరాలా 19 లక్షల పదివేల రూపాయలకు గ్రామానికి చెందిన ప్రకాశం జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి గ్రామ సర్పంచ్ ముత్యాల భారతి దంపతులు పాట వెచ్చించి దక్కించు కున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు వారిని శాలువాతో సన్మానించి అభినందించా రు. వినాయకునికి పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి కలశం ను ఊరే

గింపుగా మేళ తాళాలతో ఇంటి వద్దకు తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని కలశం వేలంలో కైవసం చేసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ వినాయకుని ఆశీర్వాదాలతో అందరికీ సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకునికి విశేష పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

ఎరువుల షాపులు తనిఖీ

విశాలాంధ్ర-పొన్నలూరు : ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కొల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఇనిస్పెక్టర్ సిహెచ్ రవిబాబు ఆధ్వర్యంలో పొన్నలూరు లో ఎరువుల షాపులను తనిఖీ నిర్వహించారు. షాపులో ఎరువులు, ధరలను పరిశీలించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ లో నిల్వ ఉన్న ఎరువలకు సరైన ఫారం, ఓ సర్టిఫికెట్ లేనందున తాత్కాలికంగా రూ 55000 స్టాకును , వేణుగోపాల్ ఫెర్టిలైజర్స్ షాపులో వచ్చిన స్టాకును ఈ పాస్ బుక్ లో నమోదు చేయనందున అమ్మకాన్ని నిలుపుదల చేస్తున్నట్టు వ్యవసాయ అధికారి వి రాము తెలిపారు. తహసీల్దార్ వివిస్ పాల్, కానిస్టేబుల్ కృష్ణ లు ఉన్నారు.

'క్విస్'లో జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతకు కళాశాల యాజమాన్యం ప్రోత్సాహకాలు అందజేసింది. ఈ సందర్భంగా కళాశాలలోని క్రీడాకారులు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులంతా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలేజి యాజమాన్యం గిడుగు వెంకట రామ్మూర్తికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టరీ విభాగానికి చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడులో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి ఫిల్లింగ్ పెట్రోల్ బంక్,శ్రీ సాయి శ్రీనివాస ఎరువుల దుకాణం,అరుణ ఇండేన్ గ్యాస్ గోడౌన్,తర్లుపాడులో గల రెండు రేషన్ షాపులను తర్లుపాడు తహసీల్దార్ కెకె కిషోర్ కుమార్ శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ లో పెట్రోల్ డీజిల్ క్వాలిటీని,పెట్రోల్ కొలతలను, పెట్రోల్ బంకులో అన్ని సదుపాయాలను,అగ్ని సామాగ్రిని పరిశీలించారు.శ్రీ సాయి శ్రీనివాస ఎరువుల దుకాణంలో గల గౌడౌన్ లో యూరియా సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం రికార్డులను పరిశీలించారు.అరుణ ఇండియన్ గ్యాస్ గౌడౌన్‌ను తనిఖీ చేసి గ్యాస్ సంబంధిత వివరాలు తెలుసుకున్నారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి రెడ్డి, వీఆర్ఓ షరీఫ్,వీఆర్ఏ చెన్నయ్య పాల్గొన్నారు.

బండ్లమూడి హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర -చీమకుర్తి: తెలుగు భాషా దినోత్సవం బండ్లమూడి హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషకు చేసినటువంటి సేవలను కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు మరియు క్రీడా కార్యక్రమాలు, జాతీయ నాయకుల యొక్క వేషధారణలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఎకో- పర్యావరణ పరిరక్షణ పోటీలలో బహుమతులు ప్రధానోత్సవం చేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు, హిందీ మేడం ఉషా వాణి, బైలాజికల్ అసిస్టెంట్ విశ్వభారతి, బ్రహ్మయ్య, యుగంధర్, నాగలక్ష్మి,శ్యామల, సోమ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శనివారం 30 ఆగస్టు 2025

చింతపాలెం జడ్పీ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని చింతయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు డీఈవో ఎస్. పురుషోత్తం తెలిపారు.2024-25 సంవత్సరానికి 50 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొని బంగారు,రజత,పథకాలు కైవసం చేసుకున్నారని, ఒకరు జాతీయస్థాయిలో పాల్గొన్నారని అందువల్ల కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఈ అవార్డులో ఇవ్వడం జరిగిందని తెలిపారు.శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును డీఈవో పురుషోత్తం,చీరాల ఉప విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా పిఈటి గోపికి అందజేశారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన చెంచయ్య

విశాలాంధ్ర - బాపట్ల : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డిని బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.బాపట్ల జిల్లాలో యువజన విభాగం అధ్యక్షులు నియామకం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో యువజన విభాగం క్షేత్ర స్థాయిలో పనిచేసే విధానంపై చర్చించారు. రానున్న కాలంలో యువజన విభాగం ఉత్సాహంగా పనిచేయాలని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేస్తున్న కాలయాపనను ఎండగట్టాలని వైవి సుబ్బారెడ్డి చెంచయ్యకు సూచించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - పర్చూరు : డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని వారిపై కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి భాస్కరరావు తెలిపారు. మండలంలో చెరుకూరు గ్రామంలో ఉన్నటువంటి ఎరువులు దుకాణాలను వ్యవసాయ అధికారి తనిఖీ చేయడం జరిగింది.ఎరువులు దుకాణాలలో ఉన్నటువంటి ఈ పాస్ మిషన్‌లో ఉన్నటువంటి స్టాకు,ఎరువుల రిజిస్టర్‌లో ఉన్నటువంటి స్టాకును,ఎరువుల షాపులో ఉన్నటువంటి స్టాకును సరిపోల్చి చూడటం జరిగింది.ఎరువుల బిల్లు పుస్తకాలు,ఎరువుల స్టాక్ రిజిస్టర్,స్టాక్ బోర్డును పరిశీలించడం జరిగింది. యూరియాను అక్రమంగా ఎక్కడైనా సరే నిల్వ ఉంచినట్లు అయితే తమ దృష్టికి తీసుకురావాలని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పందిళ్ళపల్లి హైస్కూల్‌కు 250 గ్లాసులు వితరణ

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు రాగి జావ త్రాగడంలో ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పూర్వ విద్యార్థిని గుత్తి మేఘన దాతృత్వాన్ని ప్రదర్శించింది.శుక్రవారం ఆమె పాఠశాలకు 250 గ్లాసులను బహూకరించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి మాట్లాడుతూ 2017-18 విద్యా సంవత్సరంలో పది జిపిఏ సాధించిన మేఘన, నూజివీడులో ఐఐఐటి పూర్తి చేసి,ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ,చిన్న వయసులోనే సేవాభావంతో ముందు కొచ్చినందుకు అభినందనీయం అన్నారు. మేఘనను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. లలితా పరమేశ్వరి, సూర్యనారాయణ,ప్రసన్నాంజనేయులు తదితర ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - అద్దంకి : తెలుగు భాష అమ్మ వంటిదని ఎంఈఓ గంగాధర్ అన్నారు. మండలంలోని తిమ్మాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎంఈఓ మాట్లాడుతూ తెలుగు భాష అమ్మ వంటిదని తేనె కన్నా తీయనైనదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద ...

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : తెలుగు వెలగాలి,తెలుగు భాష వర్ధిల్లాల్లి,తెలుగు భాషా ఉద్యమ కర్త గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా వికాసానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.శుక్రవారం ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మోదుగుల శ్రీరామ్ రెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు తెలుగు తల్లి గీతాన్ని ఆలపించారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి,గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఆమెతో కలసి తహసీల్దార్ షేక్ షలీమా,మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్లోరియా మాట్లాడుతూ ప్రపంచలోని భాషలు అన్నింట్లో కెల్లా తెలుగు అత్యంత మధురమైనదని ఆమె అన్నారు.తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని,తెలుగులోనే మాట్లాడదాం భావితరాలకు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని,దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు.

తహసీల్దార్ షేక్ షలీమా మాట్లాడుతూ బాపట్లకు చెందిన ఎందరో కవులు తెలుగు భాషను సుసంపన్నం చేశారని చెప్పారు.తెలుగు అజంతా భాష అని,దానికి ఏ భాష సాటి రాదని ఆమె వివరించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులు తెలుగును ఆదరించి,బాపట్ల ఖ్యాతిని నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు,మున్సిపల్ డిఈ కృష్ణారెడ్డి, చిత్రకారుడు జీవి,కళాశాల అధ్యాపకుడు హనుమాన్ నాయకులు కర్పూరపు రామారావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే... రోడ్డును ఆక్రమించిన ముళ్ళ చెట్లు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పర్చూరు మధ్య రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ చెట్లు నడిరోడ్డు పైకి వచ్చి వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ఇటీవల కాలంలో వృద్ధ దంపతులు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రక్కకు వెళ్ళగా ముళ్ళ చెట్లకు తగిలి ద్విచక్ర వాహనం అదుపు తప్పి వృద్ధ దంపతులకు గాయాలయ్యాయి.ఈ విషయాన్ని గత ఆరు నెలల నుండి ఆర్.అండ్.బి అధికారులకు తెలియజేసిన ఆర్.అండ్.బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ రహదారి వెంట ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు మండిపడుతున్నారు.

ఉన్నతాధికారులు పరిశీలించి ఈ రోడ్డు వెంబడి ఉన్న ముళ్ళ చెట్లను తొలగించకపోతే ప్రాణాలు పోయే పరిస్థితి కూడా వస్తాయని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ,అమరావతి వారి ఆదేశాల మేరకు బాపట్ల మండల సెల్ లీగల్ అథారిటీ చైర్మన్ కే. శ్యాంబాబు ఆదేశాల మేరకు బాల్య వివాహాలు, మైనర్లు గర్భం ధరించడం వలన అనారోగ్య సమస్యలు నష్టాలను గురించి వీక్లీ ప్రోగ్రాంలో భాగంగా మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్యానల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్ కుమార్ వైయస్సార్ కాలనీలో అవగాహన కల్పించారు. ప్యార లీగల్ వాలంటర్లు ఎన్.సామ్యూల్ జాన్సన్, కె.జైసిల్‌రావు,పాలపర్తి సంతమ్మ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ బ్యాంకింగ్ సౌకర్యం

ఆర్‌బిఐ జీఎం మహానా

విశాలాంధ్ర - వేటపాలెం : ప్రజలందరికీ ఆర్థిక సేవలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రీజినల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ మహానా అన్నారు.శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బాపట్ల జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడు నెలల ఆర్థిక కేంద్రీకృత ప్రయత్నం శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి బ్యాంక్ ఖాతా,డిజిటల్ లావాదేవీలు,భీమా,పెన్షన్, రుణ సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.బ్యాంకింగ్ సదుపాయాలు లేని గ్రామాలు, దూరప్రాంతాలను ప్రధాన లక్ష్యంగా చేసుకొని ఈ ప్రచారం

కొనసాగుతున్నదని వివరించారు.ప్రచారం ఉద్దేశ్యంగా ప్రతి వ్యక్తి ఖాతా తెరవడం,ఆధార్ మొబైల్ అనుసంధానం,జనధన్ ఖాతాల వినియోగం,సూక్ష్మ భీమా పథకాలు, రైతులకు రుణ సౌకర్యాలు అందించడం ఉన్నాయని చెప్పారు.సెప్టెంబర్ చివరి నాటికి నిర్దిష్ట కుటుంబాలు పరిధిలోకి రానున్నాయన్నారు.అలాగే పీఎం జన్ ధన్ యోజనలో జీరో బ్యాలెన్స్ ఖాతా,ఉచిత డెబిట్ కార్డు, రూ.2 లక్షల ప్రమాద భీమా లభిస్తుందని,పీఎం జీవన్ జ్యోతి భీమా యోజనలో సంవత్సరానికి రూ.436 ప్రీమియంతో రెండు లక్షల జీవిత బీమా కవర్ పొందవచ్చని చెప్పారు.అలాగే పీఎం సురక్ష భీమా యోజనలో సంవత్సరానికి రూ.20 ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా కవర్ లభిస్తుందని,అటల్ పెన్షన్ యోజనలో నెలకు రూ.1 000- 5000 వరకు హామీ పెన్షన్ అందుబాటులో ఉంటుందని వివరించారు.పాత సేవింగ్స్ ఖాతాలు ,పనిచేయని ఖాతాలను రీ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రెడిట్ విభాగం చీఫ్ మేనేజర్ ఎం.సంపత్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ నోడల్ ఆఫీసర్ మ హేంద్ర,వేటపాలెం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు,వెలుగు సీసీలు,యానిమేటర్లు పాల్గొన్నారు.